


జగన్‌తో బడుగులకు మేలు

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ ప్రభుత్వం పని చేస్తోందని బామ్‌సెఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు అన్నారు. - 8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 3350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
41.0°/28.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	28.0
కాకినాడ	39.4	29.0
అమలాపురం	40.0	28.0

న్యూస్‌రీల్

అనుమానిత బ్యాంకు లావాదేవీలపై నిఘా

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా



అమలాపురం రూరల్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో అనుమానిత, అసాధారణ బ్యాంకు లావాదేవీలపై నిఘా పెట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సరిహద్దు, అంతర జిల్లా చెక్‌పోస్టుల వద్ద నిఘా వ్యవస్థ పటిష్టం చేశామన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థుల వ్యయ పరిశీలన, ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రలోభాలు లేకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకు లావాదేవీలతో పాటు పోస్టల్ ఆర్డర్లు, యూపీఐ పేమెంట్లపై దృష్టి సారించాలన్నారు. బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో డిపాజిట్లు, నగదు ఉపసంహరణలపై నిఘా ఉంచాలన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద కేసులు ఉంటే, వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. డబ్బు, మద్యం గిఫ్ట్ ఆర్టికల్స్ తదితరాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వివిధ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఇంటి వద్ద నుంచే ఓటింగ్

ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, మంచానికే పరిమితమైన దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే సదుపాయం కల్పించిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. జిల్లాలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 8,343 మంది, దివ్యాంగులు 25,998 మంది ఉన్నారన్నారు. కానీ హోం ఓటింగ్‌కు 1,251 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, వీరు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. వీరికి ఈ నెల 7 నుంచి 10 తేదీ లోపు హోం ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అత్యధికంగా పి.గన్నవరంలో 421 మంది, అత్యల్పంగా కొత్తపేటలో 63 మంది, రామచంద్రపురంలో 65 మంది, ముమ్మిడివరంలో 172, అమలాపురంలో 109, రాజోలులో 161, మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 260 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఓటర్ల ఇంటి వద్దకే అధికారుల బృందం వెళ్లి బ్యాలెట్ పేపర్లను అందజేసి హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందని అన్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

అమలాపురం రూరల్: పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వీఎస్ఎం డిగ్రీ కళాశాల వద్ద రామచంద్రపురంలో, ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ముమ్మిడివరంలో, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అమలాపురంలో, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పి.గన్నవరంలో, కొత్తపేట అసెంబ్లీకి చింతం అమ్మానమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేటలో, మండపేట అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మారేడుబాక వద్ద, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గానికి రోటరీ క్లబ్ రాజోలులో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందన్నారు. 5న ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు, ఇతర పోలింగ్ సిబ్బందికి, 6న పోలీస్ సిబ్బంది, అత్యవసర సేవల ఉద్యోగులు, సూక్ష్మ పరిశీలకులు, 7న పీఓ, ఏపీఓ, ఇతర పోలింగ్ సిబ్బంది కాకుండా ఇతర ఎన్నికల విధుల్లో పాల్గొనే వీడియో గ్రాఫర్లు, డ్రైవర్లు, సెక్టార్ అధికారులు, బూత్ లెవెల్, రూట్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా రోజులలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఉంటుందన్నారు.

దేవగుప్తం పీఏసీఎస్‌కు ప్రశంసలు

అల్లవరం: డ్రోన్స్ వినియోగం గ్రీన్ రివల్యూషన్‌లో కీలక ఘట్టమని, ఇటువంటి ప్రక్రియను గ్రామీణ స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు చేపట్టడం శుభపరిణామని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త (ఎన్‌సీసీటీ) డాక్టర్ ఎల్ఎస్‌టీ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు దేవగుప్తం పీఏసీఎస్‌కు ఈ మెయిల్ ద్వారా శనివారం ప్రశంసలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డ్రోన్స్ వినియోగాన్ని చేపట్టింది. ప్రతిష్టాత్మకమైన డ్రోన్స్ టెక్నాలజీని చేపట్టడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల సహకార సంస్థలకు దేవగుప్తం పీఏసీఎస్ ఆదర్శంగా నిలిచిందని, పీఏసీఎస్ చైర్మన్ జున్నూరి రామారావు, సిబ్బంది సేవలను శ్రీనివాస్ ప్రశంసించారు. సహకార సంస్థలు నూతన సాంకేతిక ఆవిష్కరణలకు దోహదపడుతూ, వాటి ప్రయోజనాలను రైతులకు తెలియజేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని డాక్టర్ శ్రీనివాస్ ఈ మెయిల్ ద్వారా తెలిపారని పీఏసీఎస్ అధ్యక్షుడు జున్నూరి రామారావు తెలిపారు. తమను కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ గుర్తించి ప్రశంసించడం సంతోషదాయకమన్నారు.

రైతుకు రాజసం...

- పండగలా మారిన సాగు
- అండగా నిలిచిన జగనన్న సర్కారు
- ఐదేళ్ల పాలనలో వ్యవసాయానికి పెద్దపీట
- జిల్లాలో 499 రైతు భరోసా కేంద్రాలతో చేరువైన సేవలు
- పాడి రైతులకూ అనేక పథకాలు



సాక్షి, అమలాపురం/కొత్తపేట: దేశానికే అన్నం పెట్టే రైతన్నకు రాజసం వచ్చింది.. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో సాగు పండగలా మారింది.. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగలా మార్చింది.. గత ఎన్నికల ముందు పుడమి పుత్రుల కష్టాలు చూసిన సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయానికి ఊపిరినిచ్చింది. విత్తు నుంచి పంట విక్రయం వరకూ బాధ్యత తీసుకుంది. ఈ ప్రభుత్వంలో రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ, ఉచిత పంటల బీమా, ఆక్వా సర్వీసులకు రూ.1.50కు యూనిట్ విద్యుత్, పశుక్రాంతి, ఉచిత పశువుల బీమా, ఉద్యాన పంటలకు కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్ హౌస్‌లు వంటి సంక్షేమ పథకాల ద్వారా రైతులకు సాగు పెట్టుబడి తగ్గించింది. రైతు భరోసా కేంద్రాలతో క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక దన్ను, సాగు మెలకువలు అందించింది. ఈ ఆర్‌కేబీల్లో ఆయా ప్రాంతాల్లో ఏ పంట సాగు ఎక్కువగా జరుగుతుందో గుర్తించి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్ఏ), విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్ (వీఎఫ్‌వో), విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ (వీవీఏ)లను నియమించింది. వీరు క్షేత్రస్థాయిలో రైతులకు అండదండగా నిలిచి సేవలు అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే.. తడిచి, దెబ్బతిన్న పంటను కొనుగోలు చేయడం, నష్టపోయిన తరువాత పంట కాలంలోనే ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ), పంటల బీమా పరిహారం అందించడం వంటి వాటితో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

పగలూ వ్యవసాయ విద్యుత్

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు పగటి పూట తొమ్మిది గంటలు విద్యుత్ ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదే. జిల్లాలో 20,452 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 11,900లకు పైగా ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అలాగే జిల్లాలో 4,200లకు పైగా ఆక్వా విద్యుత్ కనెక్షన్లకు రూ.1.50 చొప్పున రాయితీపై విద్యుత్ అందుతోంది. ఏడాదికి రూ.70 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది.

పాడి రైతులకు పాల వెల్లువ

ప్రభుత్వం అమూల్ సంస్థతో చేసుకున్న ఒప్పందంతో పాడి రైతుల నుంచి నేరుగా పాల సేకరణ చేస్తున్నారు. తొలి దశలో 19 మండలాల్లో మొత్తం 195 ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ (ఏఎంసీయూ)లు, ఐదు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎంసీయూ)ల ద్వారా పాల సేకరణకు అధికారులు సన్నాహాలు చేశారు. రోజుకు 25 వేల లీటర్ల పాల సేకరణకు సిద్ధమవుతున్నారు. మిగిలిన ప్రైవేట్ కంపెనీలతో పోలిస్తే అమూల్ కొనుగోలు చేసే పాల ధర అధికంగా ఉంది. ఇది పాడి రైతులకు లాభసాటిగా మారింది.

వ్యవసాయం.. సేవలు సమస్తం



కొత్తపేట మండలం వాడపాలెం రైతు భరోసా కేంద్రం

మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో ఆర్బీకే ఏర్పాటైంది. దీని పరిధిలో 2019–20లో 429 మంది రైతులకు రూ.81.90 లక్షలు, 2020–21లో 449 మందికి రూ.87.55 లక్షలు, 2021–22లో 511 మందికి రూ.99.64 లక్షలు, 2022–23లో 438 మందికి రూ.85.41 లక్షలు, 2023–24లో రైతులకు రూ.52.32 లక్షల చొప్పున రైతు భరోసా వచ్చింది. మొత్తం ఈ ఆర్‌బీకే పరిధిలో రూ.4.68 కోట్లు రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధిగా అందించారు. పంట నష్టపోయిన ఐదుగురు రైతులకు పెట్టుబడి రాయితీగా రూ.34,530 వరకూ వచ్చింది. ఇప్పటి వరకూ 80.75 మెట్రిక్ టన్నుల ఎరువులను ఈ కేంద్రం ద్వారా రైతులు కొనుగోలు చేశారు. ఇలా జిల్లాలో ఏర్పాటైన 499 ఆర్బీకేల ద్వారా రైతన్నలకు సేవలు అందుతున్నాయి.

అరటికి బీమా.. పంటకు ధీమా



వాడపాలెంలో గోదావరి వరదలకు నీట మునిగిన అరటి తోట (ఫైల్)

వివిధ సీజన్లలో ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన అరటి పంటకు జిల్లా యూనిట్‌గా పంటల బీమా అమలుతో కొన్ని ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట్ల పంట నష్టం జరిగినా క్రాఫ్ ఇన్సూరెన్స్ వర్తించేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా యూనిట్‌ను మండల యూనిట్‌గా వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేయడంతో నష్టపోయిన రైతులందరికీ బీమా వర్తిస్తుంది. గతంలో అరటి పంటను బీమా పథకంలో జిల్లా యూనిట్‌గా పరిగణించేవారు. అరటి పంటల బీమా రుసుం ఎకరానికి రూ.2 వేలు ఉండేది. ఆ మొత్తాన్ని చాలా మంది సన్న, చిన్నకారు రైతులు చెల్లించలేకపోయేవారు. ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువగా ఆగస్టు నుంచి నవంబర్ మధ్య కాలంలో సంభవిస్తాయి. కానీ గతంలో బీమా పథకం డిసెంబర్ నెలలో ప్రవేశపెట్టేవారు. ఈ పథకం ఆరు నెలలు అంటే డిసెంబర్ నుంచి జూన్ వరకూ వర్తిస్తుంది. ఆ సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పెద్దగా నష్టం ఉండేది కాదు. ఇలా ఆ కాలానికి క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించిన రైతులు ఆ మొత్తాన్ని నష్టపోయేవారు. అత్యధిక విస్తీర్ణంలో పండిస్తున్న అరటికి బీమా వర్తింపజేయడంతో పాటు గ్రామం యూనిట్‌గా లేదా కనీసం మండలం యూనిట్‌గా అయినా పరిగణించాలని, అధికారుల నివేదికను 2020 అక్టోబర్ 28న కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా కలసి సమర్పించారు. ఫలితంగా గత విధానాలను సడలించి ఉద్యాన పంటలను ముఖ్యంగా అరటిని వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంలో చేర్చారు. మండలం యూనిట్‌గా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2021 ఖరీఫ్ నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.

ఐదేళ్లలో రైతుల కోసం అమలు చేసిన పథకాలు, లబ్ధి ఇలా..

పథకం	రైతులు	చేకూరిన లబ్ధి (రూ.)
వైఎస్సార్ రైతు భరోసా	1,45,890 (ఏడాదికి సగటున)	482,58,00,000
వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ	1,07,272	15,63,00,000
పెట్టుబడి రాయితీ	1,08,176	93,37,19,127
ఉచిత పంటల బీమా	2,89,745 (ఏడాదికి సగటున)	1,105,40,49,036
వైఎస్సార్ పంటల బీమా	72,267	1,30,95,00,708
వైఎస్సార్ పశు నష్ట బీమా	482	1,27,51,751

బీమా సొమ్ము వస్తుంది..



నేను 2.50 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నాను. 2022లో గోదావరి వరదలకు నష్ట పరిహారంగా ప్రభుత్వం రూ. 25 వేలు అందించింది. ఇది కాకుండా గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం బీమా పథకం అమలు చేసింది. దీంతో మరో రూ.25 వేలు అందింది. గత ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన అరటి పంటకు జిల్లా యూనిట్‌గా పంటల బీమా అమలు చేయడంతో పరిహారం వచ్చేది కాదు. ఈ ప్రభుత్వం మండల యూనిట్‌గా వైఎస్సార్ ఉచిత బీమా చేయడంతో రైతులందరికీ పంట బీమా వర్తిస్తోంది.

–బండారు శ్రీనివాసరావు (దొరబాబు), రైతు, వానపల్లి, కొత్తపేట మండలం

క్రమం తప్పకుండా రైతు భరోసా



నా సొంత భూమి మూడెకరాలతో పాటు మరో ఏడెకరాలు కౌలుకు తీసుకుని అరటి, కంద, పసుపు పంట పండిస్తున్నాను. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక క్రమం తప్పకుండా రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాలకు నష్ట పరిహారం అందుతుంది. ఏటా ఆర్‌బీ కింద రూ.13,500, మూడేళ్ల ఇన్‌పుట్ రాయితీ ద్వారా రూ.53 వేలు, సున్నా వడ్డీ రాయితీ కింద రూ.27 వేలు అందింది. గతంలో రుణమాఫీ పేరుతో సున్నా వడ్డీ రాయితీ ఇవ్వలేదు. ఇప్పుడు క్రమం తప్పకుండా వస్తోంది.

–ఇందుకూరు కృష్ణంరాజు, ఉద్యాన రైతు, ఉచ్చిలి, ఆత్రేయపురం మండలం

వైఎస్సార్ సీపీలోనే
శెట్టిబలిజలకు సముచిత స్థానం

- సుభాష్ వ్యాఖ్యలు సరికావు
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, పార్టీ శెట్టిబలిజ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ శెట్టిబలిజ నాయకులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే శెట్టిబలిజలకు సముచిత స్థానం లభించిందని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు, పార్టీ శెట్టిబలిజ నాయకులు స్పష్టం చేశారు. అమలాపురానికి చెందిన రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ శెట్టిబలిజలకు వైఎస్సార్ సీపీ ఏమీ చేయలేదని చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీతో పాటు పార్టీ నాయకులు ఖండించారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, పార్టీ శెట్టిబలిజ నాయకులు మాట్లాడారు. బోడసకుర్రులో కూటమి అభ్యర్థులు, టీడీపీ నాయకులతో జరిగిన సమావేశంలో శెట్టిబలిజలపై సుభాష్ చేసిన తప్పుడు ఆరోపణలపై వారు నిప్పులు చెరిగారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇద్దరు శెట్టిబలిజ నేతలకు రాజ్యసభ సీట్లు ఇచ్చి సగర్వంగా ఆ చట్టసభకు తొలిసారి పంపించారని గుర్తు చేశారు. శెట్టిబలిజ కార్పొరేషన్, ఎమ్మెల్సీలతో పాటు జెడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ పదవులు ఇచ్చారని వివరించారు. అంతేకాకుండా ఈ ఎన్నికల్లో రెండు ఎంపీ స్థానాలు, నాలుగు అసెంబ్లీ స్థానాల్లో శెట్టిబలిజలకు వైఎస్సార్ సీపీ టిక్కెట్లు ఇచ్చిన విషయాన్ని తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని మాట్లాడుతూ సుభాష్ టీడీపీ అభ్యర్థిగా మాట్లాడాలే తప్ప అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాలకు వచ్చి కుల రాజకీయాలు చేయడం, వైఎస్సార్ సీపీ శెట్టిబలిజలకు ఏమీ చేయలేదని అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కొందరు శెట్టిబలిజ నాయకులు బ్రోకర్లని వ్యాఖ్యానించిన సుభాష్ అమలాపురంలో ఒకప్పుడు వైఎస్సార్ సీపీ నాయకులైన అతని తండ్రి తదితరులు బ్రోకర్లు అవుతారా...? అని ఎదురు ప్రశ్నించారు. గతంలో సుభాష్‌కు వైఎస్సార్ సీపీ సముచిత స్థానమే ఇచ్చిందని గుర్తు చేశారు. తన వ్యక్తిగత స్వార్థ రాజకీయాలపరంగా అతనికి వ్యక్తిగతంగా ఏర్పడిన బాధను అదేదో మొత్తం శెట్టిబలిజ జాతికి అన్యాయం జరిగిపోయినట్లు, వైఎస్సార్ సీపీ తననేదో అగౌరపరిచినట్లు మాట్లాడడం సరికాదని హితవు పలికారు. కులాన్ని రెచ్చగొట్టే స్థాయిలో మాట్లాడే సుభాష్ తన వైఖరి మార్చుకోవాలని, రామచంద్రపురం నియోజకవర్గంలో కూడా శెట్టిబలిజలు ఉన్న విషయాన్ని గుర్తెరగాలని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, నాయకులు కుడుపూడి భరత్ భూషణ్, చిట్టూరి పెదబాబు, వాసర్ల వెంకన్న, కుడుపూడి త్రినాథ్, కముజు రమణ తదితరులు పాల్గొని సుభాష్ వ్యాఖ్యలను ఖండించారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

అమలాపురం టౌన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు శనివారంతో ముగిశాయని డీఐఈఓ వనుము సోమశేఖరరావు ఓ ప్రకటనతో పేర్కొన్నారు. గత ఫిబ్రవరి నెలలో జరిగిన ఇంటర్మీడియెట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాని విద్యార్థులకు ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్స్ శనివారంతో ముగిశాయన్నారు. అమలాపురం, కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించామన్నారు. జనరల్ కోర్సులకు సంబంధించి కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిపామన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ అడ్వాన్స్ సప్లమెంటరీ థియరీ పరీక్షలు ఉంటాయన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. 'నైతికత–మానవ విలువలు' పరీక్ష జూన్ 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 7న 'పర్యావరణ విద్య' పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని డీఐఈఓ వివరించారు.

పోలింగ్ సిబ్బందికి ముగిసిన శిక్షణ



పీఓ, ఏపీఓలకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్లు

రాయవరం: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ శనివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 1,644 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్కడ ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు రిజర్వు సిబ్బందితో సహా 13,582 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఏప్రిల్ 15న పీఓ, ఏపీఓలకు తొలి విడత శిక్షణ నిర్వహించారు. అనంతరం ఓపీఓలుగా ఎంపికైన వారికి అమలాపురంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం రెండో విడత శిక్షణ ఉద్యోగులకు పోలింగ్ విధులు కేటాయించిన నియోజకవర్గ కేంద్రాల్లోనే నిర్వహించారు. పీఓ, ఏపీఓలతో పాటు ఓపీఓలకు పోలింగ్ విధులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోలింగ్ ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మెటీరియల్ రిసీవింగ్, పోలింగ్ రోజు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహణ, అనంతరం పోలింగ్ నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలను వివరించారు. ఈవీఎంలను ఎలా ఉపయోగించాలి? బ్యాలెట్ యూనిట్‌ను వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్‌తో ఏ విధంగా అనుసంధానించాలనే విషయాలపై తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అమలాపురం, రాజోలు, పి.గన్నవరం, ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గ కేంద్రాల పరిధిలో పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ ఇచ్చారు.

శ్రీనివాసా.. శ్రీచిద్విలాసా

- భక్తులతో పోటెత్తిన వాడపల్లి
- ఒక్కరోజే రూ. 37.04 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

ఆత్రేయపురం: శ్రీనివాసా... శ్రీ వేంకటేశా అంటూ భక్తులు తన్మయత్వం చెందారు.. ఆ వాడపల్లి స్వామివారిని చూసి భక్తిపారవశ్యంతో ఓలలాడారు.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారితో పాటు ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి కల్యాణోత్సవాలు తిలకించే, ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. వీరికి ఏ విధమైన ఇబ్బంది రాకుండా డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.37,04,739 ఆదాయం సమకూరింది. ఆలయం వద్ద ఏర్పాటైన అన్నసమారాధనలో వేలాది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పందిళ్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మందపల్లిలో తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లిలో మందేశ్వరస్వామి దేవస్థానానికి రూ. 2,06,872 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కె.విజయలక్ష్మి తెలిపారు. తైలాభిషేకాల ద్వారా రూ.1,73,050, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.33,822 వచ్చిందన్నారు.

జగన్‌తో బడుగులకు మేలు

- ఫూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు
- వైఎస్సార్‌ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నయనాల కృష్ణారావు

రాజమహేంద్రవరం సిటీ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి జగన్‌ ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఫూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, బామ్‌సెఫ్‌ జాతీయ మాజీ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల పాటు సామాజిక ఉద్యమంలో పనిచేసి పూలే, అంబేడ్కర్‌ సిద్ధాంతాలను దేశవ్యాప్తంగా ప్రచారం చేశానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గాల సంక్షేమానికి చేస్తున్న కృషి అద్భుతమన్నారు. జగన్‌ ఆలోచనలు, ఆశయాలకు ఆకర్షితుడనై బామ్‌సెఫ్‌, మూల్‌ నివాసీ జాతీయ అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేసి, వైఎస్సార్‌ సీపీలో చేరానన్నారు. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్లు ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల్లో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసి బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునేలా ప్రోత్సహిస్తుందన్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌, పార్లమెంట్‌ అభ్యర్థులు మార్గాని భరత్‌రామ్‌, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్‌, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజా విజయానికి కృషి చేస్తానన్నారు. అలాగే రాజోలు, పిఠాపురం పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం చేస్తానని కృష్ణారావు తెలిపా రు. నాయకులు రేలంగి శేఖర్‌, జామి రాజ్‌కుమార్‌, రహీమ్‌, అలీషా, దంగేటి శివాజీ, మేఘేంద్ర, డి.కొండలరావు పాల్గొన్నారు.

గోదావరిలో జారిపడి యువకుడి మృతి

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి వద్ద గౌతమీ గోదావరి నదిలో ప్రమాదవశాత్తూ జారిపడి అదే గ్రామానికి చెందిన వింటి లోకేష్‌ (20) మృతి చెందాడు. అంగర ఎస్సై అందె పరదేశి కథనం ప్రకారం.. కోరుమిల్లి గ్రామ శివారు చినకోరుమిల్లికి చెందిన లోకేష్‌ నదిలోకి దిగగా ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. లోకేష్‌ తండ్రి రాంబాబు కూరగాయలు విక్రయిస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కవల కుమారులు ఉండగా, ఇందులో లోకేష్‌ మృతిచెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్సై తెలిపారు.


వింటి లోకేష్‌ (ఫైల్‌)

విద్యార్థిని ఆత్మహత్య

నల్లజర్ల: పుల్లలపాడు గ్రామానికి చెందిన దాసరి దుర్గారావు, నిర్మలల కుమార్తె వనలక్ష్మి గత మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసి ఫెయిల్‌ అయ్యింది. శనివారం ఈ విషయమై ఆమె తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన తల్లిదండ్రులు ఇద్దరు పొలం పనికి వెళ్లిన సందర్భంలో వనలక్ష్మి (15) ఇంట్లో సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు నల్లజర్ల ఏఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వనలక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎన్నిక.. భవితకు సూచిక

- ఈవీఎంలకు 41 ఏళ్లు
- పారదర్శక ఓటింగ్‌కు భరోసా



బ్యాలెట్‌ యూనిట్‌



కంట్రోల్‌ యూనిట్‌



వీవీ ప్యాట్‌

రాయవరం: ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకం.. అలాంటి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పలు సంస్కరణలు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా బ్యాలెట్‌ బాక్స్‌ మొదలు ఈవీఎం (ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మెషీన్‌) వరకూ ఓటింగ్‌ విధానంలో పలు మార్పులు తీసుకు వచ్చింది. ఈవీఎం, వీవీ ప్యాట్‌, నోటా వంటి నూతన విధానాలు పారదర్శక ఓటింగ్‌కు భరోసాగా నిలుస్తున్నాయి. 1999 ఎన్నికల్లో బ్యాలెట్‌ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల పేపరును వాడినట్లు సమాచారం. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌కు ఈవీఎం వాడడంతో 10 వేల టన్నుల కాగితాన్ని సేవ్‌ చేయగలిగారు. ఈవీఎంలపై నెలకొన్న సందేహాలకు నివృత్తిగా పలు సమాధానాలను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలపై ప్రత్యేక కథనం ఇది.

ఎప్పటి నుంచి ఎలా..

ఈవీఎంలు వినియోగంలోకి వచ్చి 41 ఏళ్లు అవుతుంది. 1982లో బ్యాలెట్‌ పత్రాలకు ప్రత్యామ్నాయంగా ఈవీఎంలు తీసుకు వచ్చారు. 1982 మే 19న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పరోగ్‌ నియోజకవర్గంలో తొలిసారి ఈవీఎంలను వినియోగించారు. అనంతరం దేశవ్యాప్తంగా 1982–83 సంవత్సరంలో పది నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో వాడారు. 1998లో ఈవీఎంల వాడకానికి ప్రజామోదం లభించింది. వివిధ రాష్ట్రాల్లో 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు. వీవీ ప్యాట్లను వాడాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. దశల వారీగా 2013 నుంచి వీవీ ప్యాట్లను వినియోగిస్తున్నారు.

ఓటు వేస్తారిలా..

ఈవీఎం ఓటింగ్‌ విధానంలో కంట్రోల్‌ యూనిట్‌ ప్రిసైడింగ్‌ అధికారి వద్ద, బ్యాలెట్‌ యూనిట్‌, వీవీ ప్యాట్‌ ఓటింగ్‌ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్‌ యూనిట్‌పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూ బటన్‌ నొక్కగానే ఎరుపు రంగు లైట్‌ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్‌ నంబరు, పేరు, గుర్తు చూపించే పేపరు స్లిప్‌ వీవీ ప్యాట్‌ విండో ద్వారా సుమారు ఏడు సెకన్ల పాటు కనిపించి, డ్రాప్‌బాక్స్‌లో పడగానే కొద్దిసేపు బీప్‌ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

ఈవీఎం అంటే..

ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మెషీన్‌ను ఈవీఎం అంటారు. ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్‌ విధానంలో రికార్డు చేయడంతో పాటుగా పోలైన ఓట్లను లెక్కించే పరికరం. ఈవీఎంలో బ్యాలెట్‌ యూనిట్‌, కంట్రోల్‌ యూనిట్‌తో పాటు జతగా వీవీ ప్యాట్‌ (ఓటర్‌ వెరిఫైబుల్‌ పేపర్‌ ఆడిట్‌ ట్రయల్‌) ఉంటోంది. ఈవీఎం బ్యాలెట్‌ యూనిట్‌లో నోటాతో పాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్‌ యూనిట్‌ను అనుసంధానం చేస్తారు. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్‌ యూనిట్లు అనుసంధానం చేయవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల వరకు సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్ఠంగా రెండు వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కానీ ఎన్నికల్లో సాధారణంగా 1,500 ఓటర్లను నమోదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

మెషీన్‌ మొరాయిస్తే..

పోలింగ్‌ సమయంలో బ్యాలెట్‌, కంట్రోల్‌ యూనిట్‌ క్రమం తప్పితే బ్యాలెట్‌, కంట్రోల్‌ యూనిట్‌తో పాటు వీవీ ప్యాట్‌తో కూడిన కొత్త సెట్‌ ఏర్పాటు చేస్తారు. పోలింగ్‌ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్‌ దశ నుంచి పనిచేయని దశ వరకూ నమోదైన ఓట్లు, కంట్రోల్‌ యూనిట్‌, వీవీ ప్యాట్‌ బ్యాలెట్‌ స్లిప్పులు కంపార్ట్‌మెంట్‌ మెమెరీలో భద్రంగా ఉంటాయి. వీవీ ప్యాట్‌ మాత్రమే పనిచేయకుంటే కంట్రోల్‌ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమెరీలో భద్రంగా ఉంటాయి. దీంతో పనిచేయని వీవీ ప్యాట్‌ స్థానంలో రిజర్వ్‌లో ఉంచిన వీవీ ప్యాట్‌ను ఏర్పాటు చేసి పోలింగ్‌ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్‌ యూనిట్‌లో నమోదైన ఓట్లను నిర్ధారించకుంటే కంట్రోల్‌ యూనిట్‌, వీవీ ప్యాట స్లిప్పులను లెక్కిస్తారు.

విద్యుత్‌ అవసరం లేదు

ఈవీఎంలకు విద్యుత్‌ సరఫరా అవసరం లేదు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు సొంతంగా బ్యాటరీ/పవర్‌–ప్యాక్‌ సౌకర్యం ఉండడంతో విద్యుత్‌ సరఫరా లేని ప్రాంతాల్లో సైతం వీటిని ఉపయోగించవచ్చు. బ్యాలెట్‌ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణా చాలా సులభం.

ఓట్ల సంఖ్య తెలుసుకోవచ్చు

ఈవీఎం కంట్రోల్‌ యూనిట్‌లో ఫలితం బటన్‌తో పాటు, టోటల్‌ బటన్‌ ఉంటుంది. పోల్‌ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్‌ నొక్కితే అప్పటి వరకూ పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్‌ ముగియగానే క్లోజ్‌ బటన్‌ నొక్కితే మెషీన్‌ ఇకపై ఓట్లను అంగీకరించదు.

ఈవీఎంల భద్రత ఇలా..

పోలింగ్‌ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్‌ రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌ రూమ్‌లకు సీల్‌ వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీలు వేస్తారు. కౌంటింగ్‌ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్‌ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌లు తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్‌ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత, వీవీ ప్యాట్‌ స్లిప్పులను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

బంగారం, నగదు చోరీ

ఐ.పోలవరం: మండలంలోని టి.కొత్తపల్లిలో ఓ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉద్దిశ వెంకటేశ్వరరావు గృహంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. బీరువాలోని 97 గ్రాముల బంగారం, 5 తులాల వెండితో పాటు రూ.19,800 నగదు తస్కరించారు. ఇంట్లో అందరూ నిద్రలో ఉండగా ఈ చోరీ జరిగింది. శనివారం బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం సీఐ కొండయ్య, ఎస్సై భానుప్రసాద్‌ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలించిన సీఐ కొండయ్య, ఎస్సై భానుప్రసాద్‌

ఇండియా బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో స్థానం



సాధించిన రికార్డులతో రియాన్స్‌

తుని: స్థానిక శ్రీప్రకాష్‌ విద్యానికేతన్‌లో యూకేజీ చదువుతున్న బి.రియాన్స్‌ ఇండియా బుక్‌ ఆఫ్‌ రికార్డుల్లో చోటు సంపాదించాడు. ఐదేళ్ల రియాన్స్‌ ఆన్‌లైన్‌ ద్వారా జరిగిన ఎంపిక ప్రక్రియలో తొమ్మిది సెకండ్లలో దక్షిణ అమెరికా ఖండంలో 13 దేశాల జెండాలను గుర్తించి ఈ ఫీట్‌ సాధించాడని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్‌ తెలిపారు. అలాగే ప్రపంచ పటంలోని దేశాలను గుర్తించడంతో పాటు ప్రపంచ దేశ రాజధానులు, భారతదేశ రాష్ట్రాల రాజధానులను గుర్తించడంలో కూడా ప్రతిభ కనబరిచాడని వివరించారు. చిన్న వయసులో ఇలాంటి ఘనత సాధించడం అభినందనీయమని విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్‌, ఉపాధ్యాయులు కొనియాడారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాజేశ్వర్‌ గోయల్‌


మీడియా సర్టిఫికేషన్‌ కో ఆర్డినేషన్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాజేశ్వర్‌ గోయల్‌

అమలాపురం రూరల్‌: ప్రసార మాధ్యమాల్లో వచ్చే రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ద్వారా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సాధారణ ఎన్నికల జిల్లా పరిశీలకుడు రాజేశ్వర్‌ గోయల్‌ ఆదేశించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రసార మాధ్యమాల పాత్ర అత్యంత కీలకమన్నారు. శనివారం అమలాపురం కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్‌ కో ఆర్డినేషన్‌, మీడియా సెంటర్‌ను ఆయన సందర్శించారు. మీడియా సర్టిఫికేషన్‌ కేంద్రం పనితీరును ఆరా తీసి, రికార్డుల ఆధారంగా చెల్లింపు వార్తలు, ప్రసార మాధ్యమాలపై నిఘా వ్యవస్థ పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు వివిధ ఎలక్ట్రానిక్‌ ప్రసార మాధ్యమాల్లో ఇచ్చే రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతిని ఎంసీఎంసీ ద్వారా తీసుకోవాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మీడియా సహకారంతో అందరూ పూర్తి సమన్వయంతో సాగాలని సూచించారు. చెల్లింపు వార్తలపై కమిటీ పర్యవేక్షణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మీడియా ఉల్లంఘనలను గుర్తించి ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత రాజకీయ పార్టీల అభ్యర్థులకు నోటీసులు జారీ చేస్తూ తీసుకుంటున్న చర్యలను బేషుగ్గా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణపై పూర్తి సమాచారాన్ని ఎగ్జిబిషన్‌ మాదిరిగా ప్రదర్శించి, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్న తీరు బాగుందన్నారు. ఎంసీఎంసీ కన్వీనర్‌ కె.లక్ష్మీనారాయణ పలు మీడియా అంశాలను సాధారణ పరిశీలకుల దృష్టికి తెచ్చారు. సామాజిక మాధ్యమాలు వివిధ ఛానల్స్‌లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలకు సంబంధించి వీడియో రికార్డింగ్‌ చేస్తూ కోడ్‌ ఉల్లంఘనలపై సంబంధిత అభ్యర్థులకు నోటీసులు జారీ చేస్తూ ఆ ప్రకటన చార్జీలను అభ్యర్థి ఖాతాలో జమ అయ్యేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అన్ని రకాల టెలివిజన్‌ చానళ్లు, కేబుల్‌ నెట్‌వర్క్‌ డిజిటల్‌ డిస్‌ప్లేలు, మొబైల్‌ నెట్‌వర్క్‌ ద్వారా ఎస్‌ఎంఎస్‌లు, వాయిస్‌ మెసేజ్‌లు, సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్‌, ట్విట్టర్‌, యూట్యూబ్‌, వాట్సాప్‌, గూగుల్‌ వెబ్‌సైట్‌ తదితరాలు ఎలక్ట్రానిక్‌ మీడియా పరిధిలోకి వస్తాయని పరిశీలకులకు వివరించారు. కార్యక్రమంలో మీడియా సర్టిఫికేషన్‌ కమిటీ సభ్యులు సీబీసీ క్షేత్రాధికారి పి.శ్రీరామ్మూర్తి, సోషల్‌ మీడియా ఎక్స్‌పర్ట్‌ ఎల్‌డీఎం కె.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిఘా బృందాల తనిఖీలు

- రూ.6.58 లక్షల నగదు సీజ్‌
- డ్యూటీ పెయిడ్‌ మద్యం స్వాధీనం


సఖినేటిపల్లి మండలంలో నగదును సీజ్‌ చేసిన నిఘా బృందం

అమలాపురం టౌన్‌: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ, ప్రత్యేక నిఘా బృందాలు విస్తృతంగా దాడులు, తనిఖీలు చేసి మద్యం, నగదు అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాయి. జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్‌, ఏఎస్పీ ఎస్‌.ఖాదర్‌ బాషా ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈ నిఘా బృందాలు శుక్ర, శనివారాల్లో జిల్లాలో పలుచోట్ల దాడులు నిర్వహించాయి. దీనిపై జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. సఖినేటిపల్లి మూడు తూముల వద్ద రెండు దఫాలు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఓ సారి రూ.4.48 లక్షలు, మరోసారి రూ.2.10 లక్షల నగదును నిఘా బృందాలు సీజ్‌ చేశాయి. జిల్లాలో అక్రమ మద్యాన్ని తరలిస్తున్నందుకు 14 కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్ట్‌ చేశారు. వారి నుంచి 205 డ్యూటీ పెయిడ్‌ మద్యం సీసాలు, 36.90 లీటర్ల ఇండియన్‌ మేడ్‌ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ద్రాక్షారామ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్‌ చేశారు. వారి నుంచి రూ.7,600 నగదు పట్టుకున్నారు. రామచంద్రపురం పోలీస్‌ స్టేషన్‌ పరిధి ముచ్చుమిల్లి గ్రామంలో ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించి రికార్డులు సరిగా లేని 28 మోటారు సైకిళ్లను సీజ్‌ చేశారు. మామిడికుదురు మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను జిల్లా పోలీస్‌ అబ్జర్వర్‌ ఎంవీ చంద్రకాంత్‌ తనిఖీలు చేసి, ఆ మండల పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. పి.గన్నవరం మండలం ముంగండ పోలింగ్‌ కేంద్రాన్ని ఎన్నికల అబ్జర్వర్‌ రాజేశ్వర్‌ గోయల్‌, కలెక్టర్‌ హిమాన్షు శుక్లా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రామచంద్రపురం, పామర్రు పోలీస్‌ స్టేషన్ల పరిధిల్లో డీఎస్పీ, సీఐ, ఎస్సైలు ఆయా గ్రామాల ప్రజలకు స్వేచ్ఛాయుత పోలింగ్‌పై అవగాహన కల్పించారు.

ఎవరా వృద్ధురాలు?

రామచంద్రపురం రూరల్‌: గుర్తు తెలియని ఓ వృద్ధురాలు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద ఓ వృద్ధురాలు కళ్లు తిరిగి పడిపోయింది. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు సంబంధించిన వారు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో సంప్రదించాలని, అదే విధంగా వివరాలు తెలిసిన వారు తమకు తెలపాలని ఎస్సై కోరారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధురాలు

వైభవంగా వేంకటేశ్వరస్వామి వ్రతం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి సన్నిధిలో శనివారం చైత్ర బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రప్రథమంగా వేంకటేశ్వరస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కనుల పండువలా జరిగింది. ఆలయ ఈఓ గ్రంధి మాధవి పర్యవేక్షణలో నిర్వహించిన స్వామి వారి వ్రతాల్లో పలువురు భక్త దంపతులు పాల్గొన్నారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామి వారి దర్శనానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,61,766 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2 లక్షల 345 ఆదాయం లభించిందన్నారు. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.61,421 విరాళంగా అందించారని తెలిపారు. 3,195 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 2,408 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.